నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

సొప్పువేరులోన షిప్పుల పేరుతో
భార్య,భర్తలెల్ల దూరమైరి
సరసమున్నచోట సంసారముండును
బాధపడ్డతోడ ఫలితమేమి

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644



విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 19 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 24-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# మళ్లీ పెట్రో మంట

- 8 రోజుల్లో మూడోసారి
- తాజాగా 90పైసలు పెంపు



న్యూఢిల్లీ
పెట్రోల్, డీజిల్ ధరలు శనివారం మరోసారి పెరిగాయి. ఎనిమిది రోజుల వ్యవధిలోనే ఇది మూడోసారి పెరగడం. దేశవ్యాప్తంగా, అన్ని వేరియంట్లలోనూ తాజాగా లీటరుకు సగటున 90పైసలు పెరిగింది. అంతేగాకుండా, ఉత్తర భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచరుల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర ఇదే కాల వ్యవధిలో మూడోసారి కిలోకు రూపాయి చొప్పున పెరిగింది.
-మిగతా 2 లో

# బాలికలదే పై చేయి...

- 86.38 శాతం పాస్
- 79.92 శాతం అర్హత సాధించిన బాలురు
- పాలిసెట్ లో 82.94 శాతం ఉత్తీర్ణత

TG POLYCET

హైదరాబాద్
తెలంగాణ పాలిసెట్–2026 లో 82.94 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. శనివారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ లోని సాంకేతిక విద్యా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, పాలిసెట్ కన్వీనర్ శ్రీదేవసేన ఈ ఫలితాలను విడుదల చేశారు. ఎంపీసీ విభాగంలో మొత్తం 98,029 మంది పరీక్ష
-మిగతా 2 లో



## ఏఐసీసీ నాపై పూర్తి
# నమ్మకంతో ఉంది

- మీడియాకు స్వేచ్ఛ ఉంది
- ఒక ఛానెల్ ప్రచారమే నిజం కాదు
- నా పనితీరుకు తీర్పు చెప్పేది సీఎం, కార్యకర్తలే
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

హైదరాబాద్
తనపై వస్తున్న ఆరోపణలు, పీసీసీ మార్పు ప్రచారం, పార్టీ అంతర్గత అంశాలపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్పందించారు. తనపై జరుగుతున్న ప్రచారాలను పెద్దగా పట్టించుకోవాలని, సరైన సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు తెలుస్తాయని స్పష్టం చేశారు. పీసీసీ చీఫ్ మార్పు అంశంపై తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని పేర్కొన్నారు. తాను సరైన వ్యక్తినని భావించినందుకే పార్టీ అధిష్ఠానం తనకు బాధ్యతలు అప్పగించిందన్నారు. ఏఐసీసీ దృష్టిలో తాను ఉత్తమ పీసీసీ చీఫ్‌గా పనిచేస్తున్నానని మహేష్ గౌడ్ తెలిపారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తన పనితీరును పలుమార్లు అభినందించారని వెల్లడించారు. తాను, ముఖ్యమంత్రి కలిసి సమన్వయంతో పనిచేయడం కొందరికి మింగుడుపడటం లేదని వ్యాఖ్యానించారు. తనపై వస్తున్న కథనాలను పెద్దగా పట్టించుకోనని, చిన్న చిన్న విషయాలపై
-మిగతా 2 లో

## టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట
# టెంపుల్ సిటీ

### రూ. 99.55 కోట్ల వ్యయంతో పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులు

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణం
- రూ. 43.80 కోట్లతో వేద పాఠశాలకు శంకుస్థాపన
- రూ. 9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణం
- రూ. 1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణం
- రూ. 1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణాలు
- రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం
- జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి వీటికి సీఎం రేవంత్ శంకుస్థాపన

2 లో

ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో సంప్రదాయ వేద విద్యను బోధించే గురుకులం ఏర్పాటుకానుంది. 43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయనగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నటువంటి వేద పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. మొత్తంగా 100 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. ?99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఈ భూమిపూజలో పాల్గొన్నారు.







2 లో

## హమ్జా అంత్యక్రియలకు పోటెత్తిన
# అగ్ర ఉగ్రవాదులు

- తుపాకులతో హాజరైన హిజ్బుల్, అల్-బదర్ అధినేతలు
- హాజరైన పాక్ గూఢచార సంస్థ ISI అధికారులు
- భారీ భద్రత నడుమ ఇస్లామాబాద్‌లో ముగిసిన అంతిమయాత్ర




2 లో

## చైనా బొగ్గు గనిలో
# భారీ పేలుడు

- 90 మంది మృతి
- ప్రమాద సమయంలో గని లోపల మొత్తం 247 మంది కార్మికులు
- గల్లంతైన వారి కోసం గాలింపు

# 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు




- కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాలు విడుదల
- తెలంగాణకు రూ. 21,517 కోట్లు..
- ఏపీకి అదనంగా రూ.7,270 కోట్లు
- ఆర్‌ఎల్‌బీలకు రూ.9,968 కోట్ల ఊతం
- యూఎల్‌బీలకు రూ.11,549 కోట్లు
- ఐదేండ్ల కాలపరిమితితో మంజూరు
- ఆడిట్ రిపోర్టులు ఆన్‌లైన్ చేస్తేనే నిధులు


2



## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి
# కట్టుబడి ఉన్నాం

- మోదీ 3.0 పాలనలో అత్యధిక లబ్ది పొందుతున్న రాష్ట్రం ఏపీ
- 2 ఏళ్లలో రూ.3 లక్షల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభం
- తెలంగాణలో 12 ఏళ్లలో 12 లక్షల కేంద్ర నిధులిచ్చాం
- యుద్ధం వల్ల ఆర్థిక సంక్షోభంలో ప్రపంచం
- దేశం సుస్థిరంగా ఉండాలంటే సప్త సూత్రాలను పాటించండి
- గుంతకల్ “రోజ్ గార్ మేళా”లో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్

హైదరాబాద్
కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. మోదీ 3.0 పాలనలో దక్షిణ భారత దేశంలో కేంద్రం నుండి అత్యధిక ప్రయోజనాలు పొందుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అందులో భాగంగా గత రెండేళ్లలో రూ. 3 లక్షల
-మిగతా 2 లో



# జమ్మూ కాశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులున్నట్లు గుర్తింపు.

- రాజౌరి అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న హోరాహోరీ ఎన్‌కౌంటర్
- ఉగ్రవాదుల కదలికలపై నిఘా వర్గాల పక్కా సమాచారం
- పాకిస్తాన్‌కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తీవ్ర హెచ్చరిక
- విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న ‘ఆపరేషన్ సిందూర్’


న్యూఢిల్లీ
జమ్మూ కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు, తీవ్రవాదులకు మధ్య శనివారం కాల్పులు జరుగుతున్నాయి. రాజౌరి పరిధిలోని డోరిమల్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ సాగుతోంది. ఈ ప్రాంతంలో కనీసం ఇద్దరు ఉగ్రవాదులు ఉన్నట్లు సమాచారం అందింది.దీంతో వారిని పట్టుకునేందుకు, అంతం చేసేందుకు భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ఈ ప్రాంతం మొత్తాన్ని గాలిస్తున్నాయి. తీవ్రవాదుల కదలికలపై స్పష్టమైన సమాచారం అందడంతో పోలీసులు, కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. సోదాలు నిర్వహిస్తుండగా, తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరిపారు. అయితే, ఇంకా ఉగ్రవాదులు చిక్కలేదు. మరోవైపు గత ఫిబ్రవరిలో ఇండియన్ ఆర్మీ ఒక ప్రకటన చేసింది.
-మిగతా 2 లో

## గోదావరి పుష్కరాలకు
# రూ.1000 కోట్లు

### జూ. కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం

- కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు
- తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు కేబినెట్ పచ్చజెండా
- తెలంగాణలో అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్
- ఆ జిల్లాలోనే సెంటర్ల ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా

హైదరాబాద్
సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రెండు గంటలుగా కొనసాగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రారంభించనున్న పలు అంశాలపై కేబినెట్ చర్చించింది. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పాఠశాలల్లో ఈ స్కీమ్ అమల్లో ఉంది. ఇప్పుడు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం
-మిగతా 2 లో




# మహానాడు పండుగలా జరపాలి



- అందరం కలిసికట్టుగా పనిచేయాలి
- ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు
- క్లస్టర్ల స్థాయిలో వర్చువల్గా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్తో కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులను ఏకం చేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని లోకేశ్ పిలుపు
- మహానాడు విజయవంతానికి ఐక్యంగా పనిచేయాలని దిశానిర్దేశం

2 లో

# మళ్లీ పెట్రో మంట

మొదటి తరువాయి

తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర 87 పైసలు పెరిగి లీటరు ధర రూ.99.51కి చేరుకోగా, డీజిల్ ధర 91పైసలు పెరిగి, లీటరుకు రూ.92.49కి చేరుకుంది. ప్రీమియం వేరియంట్ డీజిల్ ధర లీటరుకు రూ.97.81కి చేరింది. ఇక హై ఆక్టేన్ వేరియంట్‌కి చెందిన పెట్రోల్ ఎక్స్‌పి 95 ధర 87పైసలు పెరిగి లీటరు ధర రూ.106.63కి చేరుకుంది. ఇతర మెట్రోలు ముంబయి, ఢిల్లీ, చెన్నైలతో పోల్చుకుంటే కోల్‌కతాలో ఎక్కువగా ఈ పెంపు కనిపిస్తుంది. అలాగే ఇతర మెట్రోలతో పోలిస్తే చెన్నైలో పెంపు ఒక మోస్తరుగానే వుంటుంది. చెన్నైలో 82పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.105.31కి పెరగగా, డీజిల్ ధర 87పైసలు పెరిగి లీటరు రూ.96.98కి చేరింది. తాజాగా కోల్‌కతాలో లీటరు పెట్రోల్‌కు 94పైసలు పెరిగి లీటరు రూ.110.64కి చేరుకుంది. డీజిల్ కూడా 95పైసలు పెరిగింది. లీటరు ధర రూ.97.02కి చేరుకుంది. ముంబయిలో 90పైసలు పెరిగి లీటరు పెట్రోల్ ధర రూ.108,49కి చేరుకోగా, డీజిల్ ధర 94పైసలు పెరిగి, లీటరు ధర రూ.95.02కి చేరుకుంది. ఢిల్లీలో దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి)లో సిఎన్‌జి ధర కిలోకు రూ.81.09కి చేరుకుంది. మే 15నుండి వరుసగా పెరుగుతున్న ధరల పెంపుతో ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు మొత్తంగా లీటరుకు రూ.4.8 చొప్పున పెరిగాయి. మొట్టమొదటసారిగా లీటరుకు మూడు రూపాయిలు చొప్పున పెరగగా, ఆ తర్వాత సగటున లీటరుకు 90పైసలు చొప్పున రెండుసార్లు మే 19, 23 తేదీల్లో పెరిగాయి.
పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు ఆటంకం కలిగింది. దాంతో ముడి చమురు ధరలు బాగా పెచ్చరిల్లాయి. ఈ నేపథ్యంలో చమురు మార్కెటింగ్ కంపెనీలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది.

# బాలికలదే పై చేయి...

మొదటి తరువాయి

రాయగా 81,307 మంది, ఎంబైపీసీ విభాగంలో 79,652 మంది రాయగా 81.25 శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 52,201 మందికి గానూ 41,719 (79.92 శాతం), బాలికల్లో 45,828 మందికి గాను 39,588 (86.38 శాతం), ఎంబైపీసీ విభాగంలో బాలురు 40,554 మంది రాయగా 77.69 శాతం, బాలికల్లో 39,098 రాయగా 85.31 శాతం పాలిసెట్‌లో అర్హత సాధించారు. ఎస్సీలు 18,481 మంది, ఎస్టీలు 8,817 మంది పరీక్ష రాశారు. రెండు విభాగాల్లో వంద శాతం అర్హత సాధించారు. ఎంపీసీ విభాగంలో 15 మంది టాప్ ర్యాంకులు సాధించారు. వారిలో ఎనిమిది బాలురు ఉండగా, ఏడుగురు బాలికలున్నారు. ఎంబైపీసీ విభాగంలో టాప్ ర్యాంకులు సాధించిన 15 మందిలో నలుగురు బాలికలుండగా, 11 మంది బాలురున్నారు. ఎంపీసీ విభాగంలో ఓసీలు 9,771 మంది పరీక్ష రాయగా 8,185 మంది (83.77 శాతం), బీసీ-ఏలో 9,565కి గానూ 6,844మంది 71.56 శాతం, బీసీ - బీలో22,401కి గానూ 17,588 మంది 78.51 శాతం, బీసీ- సీలో 230కి గానూ 180 మంది 78.26 శాతం, బీసీ-డీలో 24,244కి గానూ 17,824 మంది 73.52 శాతం, బీసీ-ఈలో 4,520కి గానూ 3,378 మంది 74.73 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఎంబైసీలోనూ సామాజిక వర్గాల వారీగా ఓసీ, బీసీ-ఎ, బీసీ-బీ, బీసీ-సీ, బీసీ-డీ, బీసీ-ఈ వరస క్రమంలో నిలిచారు.

# ఏఐసీసీ నాపై పూర్తి నమ్మకంతో ఉంది

మొదటి తరువాయి

సమయం వృధా చేసుకోనని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛను తాను గౌరవిస్తానని మహేష్ గౌడ్ అన్నారు. అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు మీడియాకు ఉందని పేర్కొన్నారు. అయితే ఒక ఛానెల్ చేసే ప్రచారమే అంతిమ సత్యంగా భావించలేమన్నారు. గాంధీ భవన్ ట్రస్ట్‌కు సంబంధించిన వ్యవహారాలు ట్రస్ట్ పరిధిలోనే ఉంటాయని తెలిపారు. తన పనితీరును అంచనా వేయాల్సింది ముఖ్యమంత్రి, పార్టీ కార్యకర్తలేనని స్పష్టం చేశారు.

**ఫ్యూచర్ సిటీపై ప్రశంసలు.. బీఆర్ఎస్‌పై విమర్శలు**

పీసీసీ చీఫ్ చిట్‌చాట్‌లో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనా మహేష్ గౌడ్ స్పందించారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుందని అన్నారు. బీఆర్ఎస్‌కు దూరదృష్టి లేదని విమర్శించారు. హైదరాబాద్ నగర పరిధిని గత ప్రభుత్వం విస్తరించలేదని, నగరం విస్తరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీష్ రావు భావిస్తున్నారా అని ప్రశ్నించారు. అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఇప్పటికే ఏఐసీసీకి పంపించామని, త్వరలో ప్రకటన ఉంటుందని చెప్పారు. కేబినెట్ విస్తరణ పూర్తిగా ముఖ్యమంత్రి పరిధిలోని అంశమని, అందులో తన పాత్ర ఉండదన్నారు.

# హమ్జా అంత్యక్రియలకు పోటెత్తిన అగ్ర ఉగ్రవాదులు

**న్యూఢిల్లీ,**

పుల్వామా ఉగ్ర దాడి సూత్రధారి, హిజ్బుల్ చీఫ్ హమ్జా బుర్హాన్ అంత్యక్రియలకు వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన అగ్ర నేతలు తుపాకులు చేత పట్టుకొని హాజరయ్యారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తు తెలియని దుండగులు జరిపిన దాడిలో హమ్జా బుర్హాన్ అలియాస్ అర్జుమండ్ గుల్జార్ దర్ ఇటీవల హతమయ్యాడు. ఇస్లామాబాద్‌లో శుక్రవారం అతడి అంత్యక్రియలు జరిగాయి. వీటికి హిజ్బుల్ ముజాహిద్దీన్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్, అల్-బదర్ అధినేత భక్త్ జమీన్‌ఖాన్, పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ అధికారులు, ఇతర ఉగ్ర సంస్థలకు చెందిన చోటామోటా నాయకులు హాజరైనట్టు స్థానికులు సోషల్ మీడియాలో పెట్టిన వీడియోలను బట్టి తెలుస్తున్నది. భక్త్ జమీన్‌కు రక్షణగా ఆయన చుట్టూ సాయుధులైన సెక్యూరిటీ సిబ్బంది కనిపించారు. ఈ అంతిమ యాత్రపై కూడా దాడులు జరిగే అవకాశమున్నట్టు నిఘా వర్గాలు హెచ్చరించడంతో పోలీసులను కూడా భారీగా మోహరించారు.



# గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు

మొదటి తరువాయి

అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. అలాగే గోదావరి పుష్కరాల కోసం రూ. 1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సంబంధిత పనుల కోసం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఈ గోదావరి పుష్కరాలకు సంబంధించిన పనులకు.. రూ. 1000 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే మొదటి విడత కింద రూ. 300 కోట్లను మంజూరు చేసేందుకు తెలంగాణ కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన ఈ కేబినెట్ భేటీలో సీఎం, మంత్రులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. త్వరలో ప్రారంభం కానున్న 2026-2027 విద్యా సంవత్సరం నుంచి జూనియర్ కాలేజీల్లోనూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం ప్రకటించింది. అదే సమయంలో స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, పాలు కూడా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా ఈ బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలైన అస్సాం రైఫిల్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సెంటర్లను కూడా రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేస్తూ.. తెలంగాణ మంత్రివర్గం కీలక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. ఇక తాజాగా కేబినెట్ భేటీలో పలు ఉద్యోగుల భర్తీకి కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో కొత్త పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులతోపాటు.. మరో 6 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకూండా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మరో 3 పోస్టులను భర్తీ చేసేందుకు క్లియరెన్స్ ఇచ్చింది.

# టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి
- దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణం
- రూ. 43.80 కోట్లతో వేద పాఠశాలకు శంకుస్థాపన
- రూ. 9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణం
- రూ. 1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణం
- రూ. 1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణాలు
- రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హోల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం
- జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి వీటికి సీఎం రేవంత్ శంకుస్థాపన



తెలంగాణ బ్యూరో ప్రతినిధి :
యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం భూమిపూజ చేశారు. వేద పాఠశాలతో పాటు టెంపుల్ సిటీ పరిధిలో రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు ఈ సందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, అజ్మీరా లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ. 43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ వేద పాఠశాలలో సాంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నారు. ఈ సముదాయంలో హోమాలు, యాగాలు నిర్వహించడానికి ప్రత్యేక శాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. వేద పాఠశాలకు భూమిపూజతో పాటు రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హోల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం, కొండపై స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ కోసం రూ. 9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం, భక్తుల సౌకర్యార్థం వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ. 1.41 కోట్లతో రక్షణ పైకప్పు (కానోపీ) నిర్మాణం, రథశాల వైపు వాయువ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

# చైనా బొగ్గు గనిలో భారీ పేలుడు

- 90 మంది మృతి
- ప్రమాద సమయంలో గని లోపల మొత్తం 247 మంది కార్మికులు
- గల్లంతైన వారి కోసం గాలింపు

**బీజింగ్**

చైనాలోని ఓ బొగ్గు గనిలో సంభవించిన భారీ పేలుడులో సుమారు 90 మంది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు. పలువురు ఇంకా భూగర్భంలో చిక్కుకుపోయినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇటీవల కాలంలో చైనాలో జరిగిన అతిపెద్ద పారిశ్రామిక ప్రమాదాల్లో ఇదొకటిగా ప్రభుత్వ మీడియా పేర్కొంది. షాన్సీ ప్రావిన్స్‌లోని టోంగౌజ్ గ్రూప్‌కు చెందిన లియుషెన్యు బొగ్గు గనిలో శుక్రవారం(మే 22వ తేదీ) రాత్రి 7:29 గంటలకు ఈ పేలుడు సంభవించినట్లు ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 247 మంది కార్మికులు భూగర్భంలో పనిచేస్తున్నట్టు సమాచారం. వెంటనే ఘటనా స్థలానికి



చేరుకున్న రెస్క్యూ బృందాలు, అక్కడ చిక్కుకున్న చాలా మందిని శనివారం ఉదయం నాటికి సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. అయినప్పటికీ 82 మంది మృతిచెందినట్లు అధికారులు ధ్రు వీకరించారు.

**గల్లంతైన వారి కోసం గాలింపు**

ఇదిలా ఉండగా మరో తొమ్మిది మంది కార్మికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. వారిని గుర్తించేందుకు సహాయక బృందాలు గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయని అన్నారు. సంఘటనా స్థలంలో భారీ సంఖ్యలో అంబులెన్స్‌లు, రెస్క్యూ సిబ్బంది మోహరించాయి. ప్రభుత్వ ప్రసార సంస్థ, సీసీటీవీ విడుదల చేసిన వీడియోల్లో హెల్మెట్లు ధరించిన సహాయక సిబ్బంది స్ట్రెచర్లపై గాయపడిన వారిని తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. గాయపడిన వారికి అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆదేశాలు**

ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. "అన్ని ప్రాంతాలు, విభాగాలు ఈ ప్రమాదం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి. పని ప్రదేశ భద్రత విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి భారీ ప్రమాదాలు మళ్లీ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

కోట్లకుపైగా ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు చేసుకోగలిగామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉండటంవల్లే ఇది సాధ్యమైందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం సైతం మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. తెలంగాణ ప్రజలు సైతం డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలనే భావనలో ఉన్నారని తెలిపారు. అమెరికా ఇరాన్, రష్యా ఉక్రెయిన్ యుద్ధం వల్ల ప్రపంచమంతా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. భారత్ దేశం సుస్థిరంగా ఉండాలంటే ప్రధాని నరేంద్రమోదీ సూచించిన సప్తసూత్రాలను కచ్చితంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సప్తసూత్రాలను పాటిస్తూ మీరే చేసే పొదుపు... ఈ దేశ భవితకు మలుపు కానుంది అన్నారు. శనివారం మాట్లాడినట్లుంది అనిపిస్తుంది అనంతపురం జిల్లా గుంతకల్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన "రోజ్ గార్" మేళా కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం శివప్రసాద్, డీపీఓ హెచ్.ఎల్.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా 120 మంది అభ్యర్థులు ఉద్యోగ అపాయింట్ మెంట్ లెటర్లను అందుకున్నారన్నారు. కష్టపడి చదివి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులందరికీ నా హృదయ పూర్వక అభినందనలు. మీ తల్లి దండ్రులకు ప్రత్యేక అభినందనలు. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలనే లక్ష్యంతో 2022 అక్టోబర్ 22న రోజ్ గార్ మేళాను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించినప్పుడు ఇది జరిగే పనేనా? అని చాలా మంది హేళన చేశారు. వాటిని పట్టించుకోకుండా అవినీతి, పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా ఇప్పటి వరకు 11 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన మోదీ కమిట్ మెంట్ కు ఇది నిదర్శనం. 19వ విడత ద్వారా 47 ప్రాంతాల్లో రోజ్ గార్ మేళా ద్వారా మరో 51 వేల ఉద్యోగాల భర్తీ చేసి నియామక పత్రాలు అందించాం. గతంలో లీకేజీలు, పైరవీలు, దళారుల ప్రమేయంతో ఉద్యోగాలిచ్చేవారు. మోదీ పాలనలో అలాంటివి తావులేకుండా మెరిట్ ఆధారంగా అర్హులైన వారినే ఉద్యోగాలు వరిస్తున్నాయి. ఈ రోజ్ గార్ మేళాను నిరంతరం కొనసాగించాలని భావిస్తున్నాం. కర్మయోగి పోర్టల్ ద్వారా కొత్తగా ఉద్యోగాలు పొందిన వారంతా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరుతున్నా భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ గా చేయాలనే సంకల్పంతో మోదీ కష్టపడి పనిచేస్తున్నారు.

# మహానాడు పండుగలా జరపాలి

**అమరావతి**



తెలుగుదేశం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడును ఈసారి క్లస్టర్ స్థాయిలో ఒక పండుగ వాతావరణంలో, కలిసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నాహకాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇంచార్జ్‌లతో ఆయన ఆన్లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈసారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్తో నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**హైబ్రిడ్ విధానంలో నిర్వహణ**

వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి, ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడును రెండురోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేశ్ వివరించారు. దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పాలిట్బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్ఈడీ టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# 16వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు

**కేంద్ర ఆర్థికశాఖ మార్గదర్శకాలు విడుదల**
**తెలంగాణకు రూ. 21,517 కోట్లు..**
**ఏపీకి అదనంగా రూ.7,270 కోట్లు**
**ఆర్ఎల్‌బీలకు రూ.9,968 కోట్ల ఊతం**
**యూఎల్‌బీలకు రూ.11,549 కోట్లు**
**ఐదేండ్ల కాలపరిమితితో మంజూరు**
**ఆడిట్ రిపోర్టులు ఆన్‌లైన్ చేస్తేనే నిధులు**





**హైదరాబాద్,**

దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల రూపురేఖలను మార్చేందుకు 16వ ఆర్థిక సంఘం నిధులను ప్రకటించింది. 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేండ్ల కాలానికి తెలంగాణకు రూ.21,517 కోట్లు కేటాయించింది. ఏపీకి మనకంటే రూ.7,270 కోట్లు అదనంగా అంటే రూ.28,787 కోట్లు ప్రకటించింది. అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.4,35,236 కోట్ల గ్రాంట్లను సిఫార్సు చేస్తూ కేంద్ర ఆర్థికశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ స్థానిక సంస్థల(ఆర్ఎల్‌బీ)కు రాష్ట్రానికి కేటాయించిన మొత్తం నిధుల్లో రూ.7,974 కోట్లు 'బేసిక్ గ్రాంట్స్'గా, మిగిలిన రూ.1,994 కోట్లను 'పెర్ఫార్మెన్స్ గ్రాంట్స్' కింద కేంద్రం ప్రతిపాదించింది. ఏపీకి ఈ ఐదేండ్లలో మొత్తం రూ.16,628 కోట్లు (బేసిక్ గ్రాంట్స్ రూ.13,302 కోట్లు, పెర్ఫార్మెన్స్ కింద 3,32 6 కోట్లు) లభించాయితెలంగాణ కంటే ఏపీకి అదనంగా రూ.6,660 కోట్లు కేటాయించడం గమనార్హం. తెలంగాణ పట్టణ స్థానిక సంస్థల(యూఎల్‌బీ)కు బేసిక్ గ్రాంట్స్‌గా రూ.9,239 కోట్లు, పెర్ఫార్మెన్స్ గ్రాంట్స్‌గా రూ.2,310 కోట్లు మొత్తంగా రూ.11,549 కోట్లు సిఫార్సు చేశారు. ఏపీకి బేసిక్ గ్రాంట్స్ రూ.9,727 కోట్లు, పెర్ఫార్మెన్స్ కింద రూ.2,432 కోట్లు, మొత్తంగా రూ.12,159 కోట్లు కేటాయించారు. ఇలా ఆర్ఎల్‌బీ, యూఎల్‌బీలకు కలిపి తెలంగాణ కంటే ఏపీకి అదనంగా రూ.7,270 కోట్లు కేటాయించారు. విపత్తు నిర్వహణ నిధుల విషయంలో కూడా కేంద్రం తెలంగాణ పై వివక్ష చూపించింది. ఏపీకి రూ.6,125 కోట్లు కేటాయిస్తే, తెలంగాణకు మాత్రం కేవలం రూ.2,774 కోట్లే ప్రతిపాదించింది.

# జమ్మూ కాశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులున్నట్లు గుర్తింపు.

మొదటి తరువాయి



326 రోజులు శ్రమించిన తర్వాత కిష్త్వార్ ప్రాంతంలో తీవ్రవాద నెట్‌వర్క్‌ను అంతం చేశామని ప్రకటించింది. ఇటీవల ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. ఒకవేళ పాకిస్తాన్ ఇలాగే ఉగ్రవాదుల్ని పెంచుకుంటూ, ఇండియాపైకి పంపిస్తే భారత్ తీవ్రంగా స్పందిస్తుందన్నారు. ప్రపంచ పటంలో ఉండాలో లేదో పాకిస్తాన్ తేల్చుకోవాలన్నారు. పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తైంది. గత ఏడాది మే 7న ఇండియన్ ఆర్మీ ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

# అల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఎన్నిక ఏకగ్రీవం

-నందికొట్కూరులో జాతీయ కార్యవర్గ సమావేశం






**నందికొట్కూరు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిడ్తూరు మండల పరిధిలోని భరక సంజీవరాయుడు దేవస్థానంలో అఖిల భారత బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ మండలి సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ ఫెడరేషన్ సభ్యుడు చెరుకుచెర్ల రఘురామయ్య ఆధ్వర్యంలో, అడ్వకేట్ శేఖర్ శుక్ల పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ప్రదీప్ జ్యోతి జాతీయ అధ్యక్షుడిగా, తివారీ సెక్రటరీగా, కేశవరావు ట్రెజరర్‌గా, మాలిని మహిళా విభాగ అధ్యక్షురాలిగా, నవీన్ కుమార్ యువజన విభాగ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రఘురామయ్య మాట్లాడుతూ, "ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని కర్నూలు చారిత్రక ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ, దేశవ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాల నేతలు ఒకే వేదికపై ఏకమవడం ఆనందదాయకం. రాష్ట్రాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించి, అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాం" అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రదీప్ జ్యోతి, ఉత్తరాఖండ్ పండిత్ ప్రకాష్ శర్మ, కొండపల్లి కేశవరావు, పండిత్ శ్లోక శర్మ, మల్లికార్జున, డాక్టర్ భరద్వాజ్, ప్రమీల, జగన్మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గోడౌన్‌లో అగ్ని

-రూ.1 లక్ష ఆస్తి నష్టం- తప్పిన ప్రాణనష్టం






**నందికొట్కూరు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలోని కేజీఎన్ టైల్స్ గోడౌన్లో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. డిస్ కేబుల్ తాకడంతో మంటలు చెలరేగి, గోడౌన్‌లో రూ. 1 లక్ష విలువైన ఆస్తి నష్టం జరిగింది. ముగ్గురు కార్మికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, ఒక కార్మికుని ఆరోగ్యం క్షీణించినట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ, "ఫిరోజ్ డిజిటల్ సిబ్బంది అనుమతి లేకుండా వేసిన 11 కేవీ విద్యుత్ తీగల వల్లే ప్రమాదం జరిగింది. బాధ్యతారహితంగా ప్రవర్తించి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేశారు" అని ఆరోపించారు. కార్మికులు, ఫైర్ ఇంజన్ సిబ్బంది సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై ఫిరోజ్ డిజిటల్ అధికారి షబ్బీర్ అలీపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని, నష్టపరిహారం చెల్లించకపోతే జిల్లా ఎస్పీ ఎదుట తమ బాధను తెలియజేస్తామని యాజమాన్యం స్పష్టం చేసింది.

# ఆర్డీ ఆకస్మిక తనిఖీ

వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు



**నందికొట్కూరు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై రీజినల్ డైరెక్టర్ నాగరాజు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డితో కలిసి పట్టణంలోని కంపోస్ట్ యార్డును పరిశీలించిన ఆయన, అనంతరం అల్లూరు రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ క్లీనింగ్ పనులను స్వయంగా పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ఎక్కడా డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.ఈ. నాసిర్, ఏ.ఈ. దినేష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి రాశి ఫలాలు




**మేషరాశి**
మీ ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. బంధుమిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వ్యాపారులకు చిక్కులు తప్పవు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. దుర్గాదేవి నామస్మరణ శుభకరం

**వృషభ రాశి**
ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారమున ఆశించిన లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. విద్యార్థులకు విదేశీ ప్రయాణ ప్రయత్నాలలో కీలక సమాచారం అందుతుంది. నందీశ్వరుని నామస్మరణ శుభకరం

**మిధునరాశి**
ఉదర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులు ముందుకు సాగవు. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. శివ కుటుంబం నామస్మరణ శుభకరం

**కర్కాటకరాశి**
మీ గృహంలోసందడిగా ఉంటుంది. వ్యాపారులకు సకాలంలో పెట్టుబడులు అందుతాయి. అవసరానికి సన్నిహితుల సహాయం పొందుతారు. స్థిరాస్తి విషయాలలో చికాకులు తొలగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగులకు దీర్ఘకాలిక సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. గ్రామ దేవత నామస్మరణ శుభకరం

**సింహరాశి**
అనుకోని ప్రయాణ సూచనలున్నవి. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆరోగ్యపరంగా వైద్య సంప్రదింపులు అవసరమవుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వ్యాపారులకు గందరగోళ పరిస్థితులుంటాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పెరుగుతాయి. బాలింతలకు ఆకుకూరలు దానం శుభకరం

**కన్య రాశి**
వ్యాపారాలలో అనుకున్నది సాధిస్తారు. దైవచింతన పెరుగుతుంది. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగ యత్నాలలో విజయం సాధిస్తారు. సంఘంలో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి ఉన్నపటికీ నిదానంగా పూర్తిచేస్తారు. ప్రత్యంగిరా దేవి నామస్మరణ శుభకరం

**తులరాశి**
వాహన వ్యాపారస్తులకు విశేషమైన లాభాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. ఆలయ దర్శనం చేసుకుంటారు. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆర్థికంగా పురోగతి కనిపిస్తుంది. ఉద్యోగులకు అధికారుల అండదండలతో నూతన అవకాశములు లభిస్తాయి. శ్రీ భగలాముఖి నామస్మరణ శుభకరం

**వృశ్చికరాశి**
ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారమున స్వల్ప లాభాలు అందుతాయి. బంధుమిత్రులు మీ మాటతో విబేదిస్తారు. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక వాతావరణం చికాకుగా ఉంటుంది. శ్రీ భ్రమరాంబ దేవి నామస్మరణ శుభకరం

**ధనస్సురాశి**
దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. అవరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు. ఉద్యోగులకు సహోద్యోగులతో మాటపట్టింపులు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వైద్యనాథుని నామస్మరణ శుభకరం

**మకరరాశి**
విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో ఆశించిన మార్పులు చోటు చేసుకుంటాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. చేపట్టిన పనుల్లో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది. శ్రీ జంబుల పరమేశ్వరి నామస్మరణ శుభకరం

**కుంభరాశి**
స్నేహితుల నుంచి శుభవర్తమానాలు అందుతాయి. భూ వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారములు ఉత్సాహంగా సాగుతారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. నిరుద్యోగుల ఊహలు నిజమవుతాయి. ఉద్యోగుల ప్రతిభకు మంచి గుర్తింపు లభిస్తుంది. విద్యార్థుల కష్టం ఫలిస్తుంది.

**మీనరాశి**
అనవసర ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. బంధువులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. అనారోగ్య విషయంలో స్వల్ప ఇబ్బందులుంటాయి. ప్రయాణాల్లో ఆకస్మిక మార్పులుంటాయి. వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున పరిస్థితులు అంతగా అనుకూలించవు. శ్రీ ఛాయాదేవి నామస్మరణ శుభకరం

(రాశి ఫలితాలు నిపుణుల సూచనలతోపరిగణంలోకి తీసుకోవాలి)



శ్రీ కాలభైరవ ఉపవాసకులు
డక్క జంబులయ్య (స్వామి )
94911639 14

# కరెంటు షాక్‌తో ఆవు మృతి



**నిడమనూరు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిడమానూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడెం గ్రామానికి చెందిన రైతు ఇండ్ల వెంకటయ్యకు చెందిన ఆవు కరెంటు షాక్‌కు గురై మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రైతు వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆవు శుక్రవారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఈ క్రమంలో శనివారం రోజు బావి సమీపంలో ఆవు మృతదేహం కనిపించింది. దాహంతో నీటి కోసం బావి వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో ఆవు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో తనకు సుమారు రూ.50 వేల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

# శ్రీ దుర్గామాత లారీ డ్రైవర్ అసోసియేషన్ ఆర్థిక సహాయం

**చౌటుప్పల్ మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎర్రోళ్ల మల్లేష్ కు 56,000 వేలు అందించిన డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు మండల కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ ఎర్రోళ్ల మల్లేష్ ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి మోకాలు విరగడంతో విషయాన్ని తెలుసుకున్న తోటి డ్రైవర్స్ శ్రీ దుర్గామాత లారీ డ్రైవర్ అసోసియేషన్ వారు ఎర్రోళ్ల మల్లేష్ ని పరామర్శించి 56,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలాంటి డ్రైవర్స్ కి ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు దుర్గామాత లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మాత లారీ డ్రైవర్స్ అసోషియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# శక్తి యాప్ తో తక్షణమే రక్షణ

మహిళా సంరక్షణ మా బాధ్యత -- రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం



**నందికొట్కూరు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహిళల రక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, మహిళల గౌరవానికి ప్రతి ఒక్కరూ బ్రాండ్ అంబాసిడర్లుగా మారితేనే పరిపూర్ణ భద్రత సాధ్యమవుతుందని రూరల్ సీఐ టి. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ ఆర్.ఆర్. నాయక్ సూచనలతో శనివారం నందికొట్కూరు పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో "మహిళా సంరక్షణ మా బాధ్యత" అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, "ప్రతి మహిళా తన సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో 112 లేదా 7993485112 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణమే పోలీసుల సహాయం అందుతుంది" అని తెలిపారు. తల్లిదండ్రులు బాలికలకు చిన్నప్పటి నుంచే మార్గదర్శనం చేయాలని, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని ఆయన అన్నారు. సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తుగడలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ప్రమీలమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆశీర్వాదమ్మ, పోలీస్ శాఖ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# ఎస్ఐ రాంబాబును ఘనంగా సత్కరించిన నారోజు కుమారస్వామి



**మర్రిగూడ, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ రాంబాబును శనివారం ఘనంగా సన్మానించారు.బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు నారోజు కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ, "మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకూడదు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి" అని సూచించారు.ఎస్ఐ రాంబాబు మాట్లాడుతూ, "ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తాను. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాను" అని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గ్యార గోపాల్, బీజేపీ నాయకులు పంగ యాదయ్య, అమాంచాల దామోదర్, పంగ లక్ష్మణ్, దండేటికార్ మహేష్, వడ్డేపల్లి గణేష్ పాల్గొన్నారు.

# వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో కాంగ్రెస్ విఫలం

రైతులకు న్యాయం చేయాలని బీజేపీ డిమాండ్



**షాద్‌నగర్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మార్కెట్ యార్డును సందర్శించిన బీజేపీ నాయకులు రైతుల సమస్యలను పరిశీలించారు.బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లుగా ఎరువుల ధరలు పెంచకుండా భారీ సబ్సిడీ ఇస్తోంది. వరి ధాన్యానికి రూ.2389, మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర ప్రకటించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం 'ప్రతి గింజ కొనుగోలు చేస్తాం' అని చెప్పి రైతులను మోసం చేస్తోంది" అన్నారు.అందె బాబయ్య మాట్లాడుతూ, "రైతులు ప్రభుత్వ కేంద్రాలకు అమ్ముకోలేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు అమ్ముతున్నారు. ప్రతి ఎకరాకు రూ.10 వేల వరకు నష్టపోతున్నారు. వెంటనే మౌలిక వసతులు, గోదాంలు, తాగునీరు, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇస్నాత్ శ్రీనివాస్, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ఏటీఎం ధ్వంసం

-చోరీకి యత్నం -- పరారైన దొంగలు




**షాద్‌నగర్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నించారు.రాత్రి సమయంలో ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించి అద్దాలను ధ్వంసం చేస్తూ నగదు దోచుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనను గమనించిన వంశీ అనే యువకుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు.పోలీసులు చేరుకునేలోపే దుండగులు పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

# ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి

-డిండి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

**దేవరకొండ, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా డిండి మండలంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.నగరదుబ్బ తండాకు చెందిన మహేష్ తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వంగూర్ మండలం కిష్టంపల్లి గేటు వైపు వెళుతుండగా, వెనక నుంచి వచ్చిన ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల అవగాహన సదస్సు

**అమ్రాబాద్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదర మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన లిరైతు ముంగిట్లో శాస్త్రవేత్తలులి అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఏప్రిల్ 27 నుండి మే 23 వరకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో యూరియా వాడకం తగ్గించడం, రసాయనాలను అవసరమైనంత





మాత్రమే వినియోగించడం, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదులు భద్రపరచుకోవడం, సాగునీటి ఆదా, పంట మార్పిడి, చెట్లు పెంచడం వంటి అంశాలపై రైతులకు సూచనలు అందించారు.వ్యవసాయానికే పరిమితం కాకుండా అనుబంధ రంగాలపై దృష్టి సారించేలా రైతుల్లో చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలను తీసుకెళ్లడం ద్వారా అవగాహన సులభమవుతుందని, ఈ కార్యక్రమం అన్నదాతలకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని అన్నారు.ఈ సదస్సులో వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, ఏవోలు, ఏఈవోలు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వానాకాలం సాగు దృష్ట్యా రైతులకు శాస్త్రవేత్తల సూచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



**దేవరకొండ మే 23.(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1994 -95 ఎస్.ఎస్ .సిబ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం స్థానిక వి ఏ ఎస్ ఫంక్షన్ హాల్ లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ,ఒకరికొకరు అభినందనలు తెలియపరచుకొని, విద్యార్థి దశలో తాము పొందిన అనుభూతిని వెలిబుచ్చారు.ప్రస్తుతం వారు స్థిరపడిన ఉద్యోగ, వ్యాపార, ఇతర రంగాలలో తమ బాధ్యతలను గుర్తు చేసుకున్నారు .ఆనాటి ఉపాధ్యాయులు మాకు అందించిన ఉత్తమ విద్య, క్రమశిక్షణ తో మేము ఈనాడు ఈ స్థితిలో ఉన్నందుకు గర్వపడుతున్నామని, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గురువుల సేవలను కొనియాడారు .ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఎం. రఘుమారెడ్డి ,వి జంగారెడ్డి ,వి శేఖర్ రెడ్డి, ప్రసాదులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు.సమాజంలో ఉత్తమ పౌరులుగా వ్యవహరించాలని, తాము చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ,తమ తల్లిదండ్రులకు ఉత్తమ సేవలు అందించాలని ,తమ పిల్లలకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. తదుపరి పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మురళీమోహన్, మదన్మోహన్, సురేష్, తిరుపతయ్య, యాదయ్య, శ్రీపతిరావు , జంగయ్య, వెంకటేష్ ,లక్ష్మీపతి ,శేఖర్, కాసుల శ్రీనివాస్, రాజు, వెంకటేశ్వర్లు ,ఎన్ శ్రీను, రేణుక, తిరుపతమ్మ ,పద్మ, ఆసియా, యాదమ్మ ,శ్యామల, గౌసియా, అరుణ ,అమృత, తదితరులు పాల్గొన్నారు.

# వొకేషనల్ ట్రైనర్ కె. అశోక్ కుమార్‌కు జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక అవార్డు




**దేవరకొండ మే 23.(నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల కీర్తి ప్రతిష్టలు జాతీయ స్థాయికి చేరాయి. పాఠశాలలో వొకేషనల్ ట్రైనర్గా విధులు నిర్వహిస్తున్న కె. అశోక్ కుమార్ దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక 5వ భారత్ స్మార్ట్ కంక్లేవ్ లో "అత్యుత్తమ ప్రతిభ పురస్కారం 2025-2026" అవార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున ఈ అత్యుత్తమ అవార్డుకు ఆయన ఎంపిక కావడం పాఠశాలకే కాకుండా, యావత్ నల్లగొండ జిల్లాకే గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుత ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడే సాంకేతిక విద్యను అందించడంలో అశోక్ కుమార్ విశేష కృషి చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు రోబో టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), స్కిల్ ఎడ్యుకేషన్ ఒ ఇన్నోవేషన్ వంటి సరికొత్త సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఇస్తూ, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ ఉన్నతమైన భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి సాంకేతికత వైపు నడిపిస్తున్న ఆయన సేవలు ఎంతో అభినందనీయమైనవి. ఈ ఘన విజయం సాధించిన సందర్భంగా ఏఐసెక్టు స్టేట్ వొకేషన్స్ కోఆర్డినేటర్ బి. సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఆర్. నాగేశ్వరరావు , మరియు ఉపాధ్యాయ బృందం అశోక్ కుమార్ ని ఘనంగా సత్కరించి, హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను మరింత తీర్చిదిద్దాలని వారు ఆకాంక్షించారు.

# రోడ్డు ప్రమాదంగా చిత్రించిన భార్య హత్య

-చందంపేట పోలీసుల చాకచక్యం -- ముగ్గురు అరెస్ట్




**దేవరకొండ, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్గొండ జిల్లా చందంపేట మండలం బిల్డింగ్ తండాకు చెందిన రమావత్ నర్సింహా (51) మే 19న మోటార్ సైకిల్‌తో సహా రహదారి పక్కన శవమై కనిపించాడు. మొదట ఇది రోడ్డు ప్రమాదమని భావించిన పోలీసులు, మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో మృతుడి రెండో భార్య రమావత్ జ్యోతి ప్రవర్తనపై అనుమానం రావడంతో విచారణ జరిపారు. చివరికి ఆమె తన ప్రియుడు నేనావత్ రాజు, అక్క రమావత్ లక్ష్మీతో కలిసి ముందస్తు పథకం ప్రకారం హత్య చేసినట్లు ఒప్పుకుంది.నిందితులు నర్సింహాను మద్యం తాగించి, ముక్కు--నోరు మూసి ఊపిరాడకుండా చేసి చంపి, అనంతరం శవాన్ని బైక్ పక్కన పడేసి ప్రమాదంలా సీన్ క్రియేట్ చేశారు. దొంగతనం కేసుల ఆధారంగా తప్పుదోవ పట్టించేందుకు ట్రాక్టర్ బ్యాటరీ, పానర్‌ను అక్కడ ఉంచారు.పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి, మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్లు, ట్రాక్టర్ బ్యాటరీ, మద్యం సీసా, ఎల్‌జీ బాండ్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును వేగంగా ఛేదించిన డిండి సీఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్ బృందాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# నిరుపేద కుటుంబానికి అండగా ఆర్ కేసేవా ఫౌండేషన్



**దేవరకొండ, మే 23. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ నియోజకవర్గం నేరేడుగొమ్ము మండలంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ట్రాక్టర్ డ్రైవర్ దశరథ కుటుంబానికి ఆర్ కే సేవా ఫౌండేషన్ మరియు బి ఆర్ ఎస్ నాయకులు వద్య రమేష్ నాయక్ ఆర్థిక సహాయంఅందజేశారు. అనంతరం వారి పరిస్థితి గమనించిన బి ఆర్ ఎస్ నాయకులు పార్టీ తరుపున గృహ నిర్మాణానికి 50 బస్తాల సిమెంట్ ఒప్పుకొని కుటుంబాన్ని ఓదార్చారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వద్య రమేష్ కి ఫౌండేషన్ సభ్యులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపి వారి సేవలు మా ఫౌండేషన్ పై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో నేరేడుగొమ్ము సర్పంచ్ పులికంటి సుధాకర్, బి ఆర్ ఎస్ పిపిసియస్ చైర్మన్ బల్లయ్య, ఉప అధ్యక్షులు కరాటే మాస్టర్ శ్రీను, ప్రధాన కార్యదర్శి పొట్ల విజయ్ కుమార్, ఇరగదిండ్ల రామకృష్ణ, మాజీ ఎంపీపీ అరకంటి రాములు, జక్కుల లింగం,గార్లపాటి శ్రీకాంత్, అరకంటి యేసయ్య,అరకంటి విజయ్, పాస్టర్ ప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండలో చల్లని వ్యాపారం





**- వేడిమి నుంచి ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్న జనం**

**- వేసవిలో ఫుల్ గిరాకీ ఉంటుందంటున్న వ్యాపారులు**

**ఆమనగల్లు, మే 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎండల వేడిమి, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు భగభగమండుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. అత్యవసర పనులుంటేనే రక్షణ చర్యలు తీసుకొని బయటకు వెళుతున్నారు. అయినా ఎండలకు తాళలేక ఉపశమనం పొందేందుకు కూల్ డ్రింక్స్, పండ్లరసాలు తీసుకుంటున్నారు. దీంతో వేసవి కారణంగా పట్టణంలో జ్యూస్ పాయింట్లు, కొబ్బరిబొండాలు, సోడా సెంటర్లకు గిరాకీ పెరిగింది.

**రూ.10 నుంచి రూ.80 వరకు..**

నియోవేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి వివిధ సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అయినా ప్రజలు నీటికి బదులుగా చెరుకు, నిమ్మ, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలవైపు మక్కువ చూపుతున్నారు. కొందరు శీతలపానీయాలవైపు మొగ్గుచూపుతున్నారు. కానీ శీతలపానియాలకంటే పండ్ల రసాలే మేలంటున్నారు వైద్య నిపుణులు. పట్టణంలో జ్యూస్ పాయింట్లలో ఒక గ్లాస్ జ్యూస్ కు పండు రకాన్ని బట్టి ధర మారుతోంది. పైనాపిల్ జ్యూస్, మ్యాంగో, వైట్ కర్బూజా జ్యూస్ కు రూ.20 ఉండగా, గ్రేప్స్ జ్యూస్ కు రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా చెరుకు రసం రూ.20, లస్సీ రూ.30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు. బెంగూళూర్ కొబ్బరి బొండం రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. అయినా ప్రజలు వేడిమి నుంచి ఉపశమనం కోసం ఎంత ధర ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. దీంతో జ్యూస్ పాయింట్లు, చెరుకు, కొబ్బరిబొండాల దుకాణాలు ఫుల్ గిరాకీతో నడుస్తున్నాయి. వేసవి సీజన్ అంతా బాగానే కొనుగోలు జరుగుతాయని దుకాణాల నిర్వహకులు పేర్కొంటున్నారు.

# రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తాం


**- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



**మిర్యాలగూడ, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడ్గులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వసతులు, తూకాలు, కొనుగోలు ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతమే. నియోజకవర్గంలో పండించిన ప్రతి గింజను మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. ‘కటింగ్’ పేరుతో ఎవరైనా ఇబ్బంది పెడితే సహించేది లేదు” అని హెచ్చరించారు. తూకాల విషయంలో అవకతవకలు జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, ఐకేపీ ఏపీఎం, సీసీలు, వీఓఏలు, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# జీపీ కార్యాలయానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు విరాళం

**-ప్లాస్టిక్ రహిత గ్రామం లక్ష్యంగా సర్పంచ్ గోపు రజిత**



గ్రామపంచాయతీ స్టీల్ ప్లేట్స్, గ్లాసులు తదితరు నిత్యవసర సామాను అందజేస్తున్న సర్పంచ్ గోపు రజిత లక్ష్మారెడ్డి.

**ఎలిగేడు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలం బుర్హాన్మియాపేట గ్రామ సర్పంచ్ గోపు రజిత--లక్ష్మారెడ్డి దంపతుల కుమార్తె జీవనజ్యోతి జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆమె జ్ఞాపకార్థం రూ.5 వేల విలువైన స్టీల్ బ్యాంక్ ప్లేట్లు, గ్లాసులు, నిత్యావసర వస్తువులు జీపీ కార్యాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే మా ప్రధాన లక్ష్యం. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపు రజిత--లక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ పుల్యాల మంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేశ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో బాస్కర్‌రావు



**ఎలిగేడు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లి గ్రామాన్ని ఎంపీడీవో బాస్కర్‌రావు శనివారం సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాన్ని పరిశీలించిన ఆయన, పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. అనంతరం జీపీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్, పంచాయతీ కార్యదర్శి అశోక్, కారోబార్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బస్ స్టేషన్లో తప్పిపోయిన బాలుడుని తల్లిదండ్రులకు అప్పగించిన కంట్రోలర్



**హుస్నాబాద్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ బస్ స్టేషన్లో శనివారం మధ్యాహ్నం ఒక బాలుడు ఒంటరిగా తిరుగుతూ కనిపించడంతో సిబ్బంది అప్రమత్తమై అతన్ని తమ వద్దకు తీసుకొని విచారణ చేపట్టారు. కొంతసేపటికి బాలుడి తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని, అతను తమ కుమారుడేనని తెలిపారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించిన అనంతరం బాలుడు నిజంగా వారికే చెందినవాడని నిర్ధారించి, బస్ స్టేషన్ కంట్రోలర్ మహేందర్, సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తండ్రి గొల్లెన కుమార్ తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందినవారని, బాలుడి పేరు గొల్లెన అనిరుధ్ అని తెలిపారు. బాలుడిని గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన బస్ స్టేషన్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. ప్రజల భద్రత కోసం అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బంది చర్య ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు.

# మంత్రులను కలిసిన నల్ల వీరన్న

**-సామాజిక సేవా కార్యక్రమాలపై అభినందనలు**








**మహబూబాబాద్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా ప్రకాశ్ ఎలక్ట్రికల్స్ అధినేత నల్ల వీరన్న శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులతో పలు అంశాలపై చర్చించిన వీరన్నకు, ఆయన చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు అభినందనలు తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.

# పెసరవాయిలో ఆపరేషన్ వజ్రప్రహార్

**-చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిఘా -- ప్రజలకు అవగాహన**







**గడివేముల (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన, చట్టవ్యతిరేక కార్యకలాపాల అరికట్టడంలో భాగంగా ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం. జావళి ఐపీఎస్ సూచనలతో గడివేముల సబ్ ఇన్స్పెక్టర్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో పెసరవాయి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నేరచరిత్ర గల వారి ఇళ్లను, అనుమానాస్పద ప్రదేశాలను, బెల్ట్ షాప్‌లను తనిఖీ చేసి, ధ్రువపత్రాలు లేని మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఫ్యాక్షన్ పికెట్‌ను కూడా పరిశీలించారు. తరువాత గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి, మహిళలు--పిల్లలపై నేరాలు, ఆస్తి నేరాలు, రహదారి భద్రత, బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్ మోసాలు, మాదకద్రవ్యాల హానికర ప్రభావాలు, ఫ్యాక్షన్ సమస్యలు, శక్తి యాప్ ప్రయోజనాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

# యూరియా వినియోగాన్ని తగ్గించాలి

**- శాస్త్రవేత్త డాక్టర్ బలరాం**



**ఆమనగల్లు, మే 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ బలరాం అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బలరాం మాట్లాడుతూ.. వ్యవసాయంలో లాభదాయకత పెంచేందుకు రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా వినియోగించడం వల్ల నేలలోని సహజ పోషకాలు దెబ్బతిని, పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ తాళ్ళ రవీందర్, మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారులు మీనాక్షి, బాలకృష్ణ, భూదేవి, నిఖిత మరియు రైతులు కమటం రవి, వసంత మధు, గద్ద నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**- కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్**



**ఆమనగల్లు, మే 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయమని కౌన్సిలర్ ఎనుమల్ల రమేష్ రాము అన్నారు. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బీసీ కాలనీలో వార్డు ప్రజలతో కలిసి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అధ్యయనం చేశారు. నిత్యం ప్రజల కోసమే జీవిస్తానని, వారి సమస్యలను పరిష్కరించడమే తన ధ్యేయమని రమేష్ అన్నారు. ఆయన వెంట కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన జక్కిలి ఐలయ్య యాదవ్.



**యాదాద్రి భువనగిరి జిల్లా, మే 23 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వేద పాఠశాల నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా విచ్చేసిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి స్వాగతం పలుకుతున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కిలి ఐలయ్య యాదవ్

# రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యువత మద్దతుతో బీఎస్పీ పార్టీ గెలుస్తుంది

**- పచ్చిమట్ల రవీందర్ గౌడ్**




**హుస్నాబాద్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: దేశంలో నిరుద్యోగ సమస్యలు, అవినీతి, విద్య--వైద్య రంగాల్లో లోపాలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై యువత ఆగ్రహం వ్యక్తం చేస్తోందని, ఈ అసంతృప్తి బీఎస్పీ పార్టీకి మద్దతుగా మారుతోందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ తెలిపారు.ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యల నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన అభిజిత్ దుల్కే సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో అకౌంట్ ప్రారంభించగా, ఐదు రోజుల్లోనే కోట్లాది ఫాలోవర్లు చేరారని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగం, అవినీతి, పరీక్షల లీకులు, ధరల పెరుగుదల, మహిళలకు రిజర్వేషన్లు వంటి అంశాలను మేనిఫెస్టోలో ప్రస్తావించడం వల్ల యువత పెద్ద ఎత్తున స్పందిస్తోందని వివరించారు.ప్రధాన మీడియా, వ్యవస్థలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని, ఈ కారణంగానే యువత కొత్త వేదికల వైపు మొగ్గుచూపుతోందని ఆయన అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పట్టించుకోని అధికార పార్టీ నేతలకు ప్రజలు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత మద్దతుతో బీఎస్పీ పార్టీ గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు శంకర్, సుధాకర్, శరత్ పాల్గొన్నారు.ప్రజా సమస్యలపై యువత ఆగ్రహం బీఎస్పీకి బలంగా మారుతోందని నేతలు స్పష్టం చేశారు.

# 40వ డివిజన్‌లో డ్రైనేజీ పనులకు శ్రీకారం



**కరీంనగర్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 40వ డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డివిజన్ కార్పొరేటర్ నలువాల పుష్పలత రవీందర్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.నగర మౌలిక వసతుల అభివృద్ధి కోసం డ్రైనేజీ పనులు వేగంగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.


# గర్భాశయ క్యాన్సర్ నివారణకై వ్యాక్సిన్ కార్యక్రమం



**తిమ్మాపూర్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రేణికుంట గ్రామంలో గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎలుక అంజనేయులు మాట్లాడుతూ, గ్రామంలోని ఎనిమిది మంది బాలికలకు ఈ రోజు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ప్రతి బాలిక ఆరోగ్యంగా, సురక్షితంగా ఉండేందుకు ఈ వ్యాక్సిన్ భవిష్యత్తులో వచ్చే ప్రమాదకర వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సజిదా అతారి, డాక్టర్ జావేరియా ఇమ్రోజ్, ఏఎన్ఎం పద్మ, వార్డు సభ్యులు బోయిని శంకరయ్య, బావండ్ల ప్రవీణ్, కనపర్తి చంద్రశేఖర్, ఆశా కార్యకర్తలు ఎలుక విజయలక్ష్మి, శ్వేత, కర్ర అరుణ తదితరులు పాల్గొన్నారు.గ్రామ బాలికల ఆరోగ్య రక్షణకు వ్యాక్సిన్ కార్యక్రమం కీలకమని నాయకులు పేర్కొన్నారు.

# పీహెచ్‌సీలో టీబీ ముక్త భారత్ ఎక్స్-రే క్యాంపెయిన్

**మానకొండూర్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామ పీహెచ్‌సీలో ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కింద ఎక్స్-రే క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపసర్పంచ్ రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ, దేశ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని, గ్రామ ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలన కోసం అవగాహన కల్పిస్తూ ఎక్స్-రే పరీక్షలు నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి చావనలాల్, వైద్య అధికారి డా. సాయిప్రసాద్, పీహెచ్ఎన్ రుద్రమదేవి, హెచ్ఈఓ వెంకటేశం, హెల్త్ సూపర్వైజర్ హాజీ బాబా, ఏఎన్ఎంలు సుమతి, స్వప్న, ఆశా కార్యకర్తలు అంజలి, భాగ్యలక్ష్మి, కారోబార్ సుంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణకు టీబీ ముక్త భారత్ కార్యక్రమం కీలకమని అధికారులు పేర్కొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**కరీంనగర్ రూరల్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ నాలుగవ డివిజన్‌లో కార్పొరేటర్ భూపతి రవీందర్ ఆధ్వర్యంలో అపోలో రీచ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ శిబిరంలో అపోలో రీచ్ హాస్పిటల్ వైద్య సిబ్బంది డివిజన్ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు.ఈ కార్యక్రమంలో వృద్ధులు, స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ఉచిత వైద్య శిబిరం ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# వలస కార్మికుల వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభం



**కరీంనగర్ రూరల్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయడానికి ఇతర రాష్ట్రాల నుండి వచ్చి నివసిస్తున్న కార్మికుల వివరాల నమోదు ప్రక్రియను కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ మాట్లాడుతూ, నేపాల్, బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుండి వచ్చిన కార్మికుల వ్యక్తిగత వివరాలు, నివాస చిరునామాలు, ఉపాధి వివరాలను సేకరించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. స్టేషన్ హౌస్ అధికారి ట్రైనీ ఐపీఎస్ సోహం సునిల్ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం ఈ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని కార్మికులకు అవగాహన కల్పిస్తూ వారి వివరాలను నమోదు చేశారు.వలస కార్మికుల వివరాల నమోదు శాంతిభద్రతల పరిరక్షణకు కీలకమని అధికారులు తెలిపారు.

# చౌక ధర దుకాణాల నియామక ప్రక్రియ ప్రారంభం

**కరీంనగర్, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం నుండి జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలోని 68 చౌక ధరల దుకాణాలకు నియామక ప్రక్రియ చేపట్టారు.ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా మొత్తం 391 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 1:5 నిష్పత్తిలో 218 మందిని ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల అనంతరం మెరిట్ ఆధారంగా 55 చౌక ధరల దుకాణాలకు 55 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.చౌక ధరల దుకాణాల నియామక ప్రక్రియ పారదర్శకంగా పూర్తయిందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

# ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం




**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ చేతుల మీదుగా వాల్ పోస్టర్ విడుదల చేశారు అని కళాశాల ప్రిన్సిపల్ డి. వెంకట రమణ తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని ఎమ్మార్వో కార్యాలయాలలో ఉచిత అడ్మిషన్ రిజిస్ట్రేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ప్రచార పత్రాలు కూడా విడుదల చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ఉచిత యూనిఫారం, నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించే అవకాశం ఉందని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో అందుతాయని విద్యార్థులకు గుర్తుచేశారు.పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ నిజధృవపత్రాలు, ఫోటో, ఫోన్ నెంబర్, ఇమెయిల్ ఐడీతో దగ్గరలోని రిజిస్ట్రేషన్ సెంటర్‌ను సంప్రదిస్తే వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఐటీఐలో చేరి భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రిన్సిపల్ విజ్ఞప్తి చేశారు.పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈ సదవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని సూచించారు.

# జాతీయ రహదారిపై రైతుల నిరసన



**మనోహరాబాద్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరి, మొక్కజొన్న పంటలు కోతలు పూర్తయి 10--15 రోజులు గడిచినా కొనుగోలు జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌పోర్టేషన్ లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఐకేపీ కేంద్రాల్లో వడ్ల కుప్పలు పేరుకుపోయి రైతులు నిరాశకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో మనోహరాబాద్ జాతీయ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. ఎండనక వాననక రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంట అమ్ముడుపోక రైతుల జీవితం అగమ్యగోచరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ధర్నాకు మద్దతుగా టిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం చూపడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. వెంటనే వడ్ల కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ మండల టిఆర్ఎస్ అధ్యక్షుడు ఇమాంపూర్ శేఖర్, మాజీ ఎంపీటీసీ పొట్టోల లతా, వెంకట్ గౌడ్, అర్జున్ యాదవ్, టిఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు.

# రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం విద్యార్థుల పోరాటానికి బీసీ సంఘాల మద్దతు



**పెద్దపల్లి, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు రాకేష్ దత్తా చేపట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం జరుగుతున్న నిరాహార దీక్షకు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం మద్దతు తెలిపింది. రాష్ట్ర బీసీ విద్యార్థి జనరల్ సెక్రటరీ పి. హరి కృష్ణ యాదవ్ శనివారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, జీవో నెంబర్ 7ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాకేష్ దత్తా ఖమ్మంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా హరి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, నిధులు విడుదల కాకపోవడంతో పేద, బీసీ మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్య కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారుతున్నాయని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని, విద్య హక్కును కాపాడే దిశగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.ఈ నిరాహార దీక్షలో రాజం సున్విత్, గణేష్ వెల్పుల, రాజు కుక్క, వంశీ కుక్క తదితరులు పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం విద్యార్థుల పోరాటానికి బీసీ సంఘాల మద్దతు లభించింది.

# విత్తన పరీక్షలతో నకిలీలకు చెక్...






-నాణ్యత లేని విత్తనాలతో రైతులపై ఏటా కోట్లాది రూపాయల ఆర్థిక భారం.
- కల్తీ ల గుర్తింపుకు సులువైన విత్తన పరీక్షలు
- విత్తన కొనుగోలు రశీదులు జాగ్రత్తగా ఉంచుకోవాలి

విత్తు ను బట్టే పంట అంటారు పెద్దలు... మనం సాగు చేయబోయే పంటకు సంబంధించి మనం ఎన్నుకున్న విత్తనం మంచిదైతేనే ఆ పంట మంచి దిగుబడితో కర్షకులకు అనుకున్నంత లాభాలను ఇవ్వగలుగుతుంది... విత్తన ఎంపికలో రైతులు ఏమరపాటులో చేసే చిన్న చిన్న పొరపాట్ల కారణంగా వారి కుటుంబం మొత్తం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులలో కుంగిపోవాల్సి వస్తుంది. ఖరీఫ్ సాగు కొరకు విత్తనాల కొనుగోలు ఊపందుకున్న తరుణంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ ఈ క్రింది సూచనలు చేస్తున్నారు.

**అప్రమత్తతే శ్రీరామరక్ష:**

ఖరీఫ్ పంట కాలం ప్రారంభం అవ్వడంతో ప్రస్తుతం మార్కెట్లో విత్తన కొనుగోలు జోరు మీద సాగుతుంది. కర్షకులు తమకు కావాల్సిన విత్తనాలను తమకు తెలిసిన విత్తన వ్యాపారుల వద్ద నుండి లేదా డీలర్ షాపుల నుండి కొనుగోలు చేస్తున్నారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాపారులు బాగా తెలిసిన వారైనా సరే విత్తన కొనుగోలుకు సంబంధించిన రశీదు ను రైతులు తప్పనిసరిగా అడిగి తీసుకోవాలి. రశీదు పై రైతు పేరు, గ్రామము, విత్తన రకము, లాట్ నంబరు, కొనుగోలు ధర వంటి విషయాలు రయించుకోవాలి. భవిష్యత్తులో మనం కొనుగోలు చేసిన విత్తనం లో ఏవైనా జన్యు పరమైన లోపాలు వచ్చినా లేదా అవి నకిలీవి అని నిర్ధారణ ఐన సందర్భంలో విత్తన వ్యాపారుల నుండి రైతుకి నష్ట పరిహారం ఇప్పించడం లో ఈ విత్తన కొనుగోలు రశీదు ప్రముఖపాత్ర పోషిస్తుంది.

**అధీకృత డీలర్ల నుండే విత్తన కొనుగోలు ఉత్తమం:**

విత్తనాలను ఎప్పుడూ వ్యవసాయ శాఖ వారి నుండి అధికారికంగా విత్తన లైసెన్సులు పొందిన డీలర్ శాపుల నుండి కొనుగోలు చెయ్యడం వల్ల రైతులు మోసాల బారిన పడి అవకాశాలను తగ్గించుకోవచ్చు. చిరిగిన, లేదా మూతి తెరిచి ఉన్న విత్తన ప్యాకెట్ల కొనుగోలును రైతులు తిరస్కరించాలి. కొనుగోలు సమయంలో విత్తన ప్యాకెట్ల పై విత్తన రకం, మొలక శాతం, స్వచ్ఛత శాతం, లాట్ నంబరు, అమ్మకం ధర, విత్తన పరీక్ష చేసిన తేదీ వంటి కనీస వివరాలు ఉన్నాయో లేదో చూసుకుని కొనుగోలు చెయ్యాలి. కొన్ని రకాల కంపెనీలు తమ ఒరిజినల్ విత్తన ప్యాకెట్లను గుర్తించడానికి టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశాయి. విత్తన ప్యకెట్లపై ఉన్న క్యూ-ఆర్ కోడ్ ను స్కాన్ చెయ్యడం వల్ల కూడా ఆ విత్తనానికి సంబంధించిన వివరాలను తెలుసుకోవచ్చు.

**విత్తే ముందే మొలక శాతం పరీక్ష చేసుకోవాలి:**

రైతులు మార్కెట్లో కొనుగోలు చేసిన విత్తనాలను నేరుగా పంట చెలలో విత్తుకోకుండా రైతు స్థాయిలోనే విత్తన మొలక శాతం పరీక్షలు చేసుకోవాలి. ప్యాకెట్ ను కొద్దిగా తెరచి ఒక 100 గింజలు నాటితే కనీస మొలక శాతం వరి కి 80% ఉండగా మొక్కజొన్న కు 90%, పత్తి కి 65%, నూనె గింజ పంటలకు 70% మొలకలు వస్తున్నాయా లేదా పరీక్షించుకున్నాకే ప్రధాన పంట చేనులో విత్తుకోవాలి.

పంటల సాగు పూర్తయ్యేవరకు మొక్కల ఎదుగుదలలో రైతులు ఏవైనా లోపాలను గమనించినట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

మీ
**రాజ్ కుమార్ బాదవత్,**
**ఏఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు,**
**తెలంగాణ.**



## అవినీతి అధికారుల వెనుక ఉన్న ప్రతి ఒక్కరిని అరెస్టు చేయాలి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.**



**కుత్బుల్లాపూర్ మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మేడ్చల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశి మోహన్ 100 కోట్ల పైబడి అవినీతిని కనిపెట్టిన ఏసీబీ అధికారులు దానికి ప్రధానమైన కారకులను కూడా కనిపెట్టి అవినీతిపరులను కటకటాల వెనకాలకు పంపించాల్సిందిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ నేడు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో మేడ్చల్ జిల్లాలోని వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఆయా మండలాల్లో కబ్జాలకు గురైందని, ఆ కబ్జాలు ఏ ఒక్కరి వల్ల సాధ్యం కాదని దాని వెనకాల ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల హస్తం లేకుండా జరగదన్నారు. గతంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్గా పనిచేసిన ఆమెయ్ కుమార్, ఇప్పటి డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్, మొన్న అరెస్ట్ అయిన జలమండలి అధికారి అనంతలక్ష్మి కుమార్ లాంటివారు అనేకమంది అవినీతికి పాల్పడడం వారి దగ్గర వందల కోట్ల విలువైన డబ్బులు స్థలాలు వస్తువులు దొరకడం చూస్తుంటే ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి ఎంత విస్తరించిందో అర్థం అయిందని కావున ఏసీబీ అధికారులు అవినీతిలో దొరికిన ప్రభుత్వ అధికారులపై మాత్రమే దృష్టి పెట్టకుండా వారికి సహకరించిన ప్రతి ఒక్కరిని చట్టరీత్యా శిక్షించాలని కోరారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చి బిల్డింగులుగా చేసేందుకు రెవెన్యూ వ్యవస్థ, మున్సిపల్ వ్యవస్థ, ఎలక్ట్రికల్ వ్యవస్థ, వాటర్ వర్క్స్ వ్యవస్థ లు అవసరమైతయని కాబట్టి పై అధికారులు చేసిన అవినీతిలో ఈ వ్యవస్థల నుండి ఎవరో ఒకరు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సహకార అందించాల్సిందేనని అలాంటి వారిని గుర్తించి శిక్షించాల్సిందేనని డిమాండ్ చేశారు. దొరికిన అధికారులను మాత్రమే శిక్షిస్తే అవినీతిని రూపుమాపలేమని దానికి అసలు కారణమైనటువంటి కారకులను గుర్తించి శిక్షిస్తే భవిష్యత్తులో అవినీతిని రూపుమాపవచ్చు అని అన్నారు.

## రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి


వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బిఆర్ఎస్ నాయకులు




**ఎలిగేడు మండలంలో**
**బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**ఎలిగేడు, మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి--మోహన్ రావు డిమాండ్ చేశారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు లాలపల్లి, ముప్పిరితోట, రాములపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గన్నీ సంచులు లేకపోవడం, లారీలు అందకపోవడం, కొనుగోలు ప్రక్రియలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. "వర్షాలు పడితే ధాన్యం తడిసి రైతులు భారీ నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలి. లేని పక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తాం" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బైరెడ్డి రామిరెడ్డి

## దగడపల్లి గ్రామంలో పిడుగు పడి గడ్డివాములు దగ్ధం

**వనపర్తి జిల్లా ప్రతినిధి మే 23 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చిన్నంబావి మండల పరిధిలోని దగడపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొమ్మ శంకర్‌కు చెందిన గడ్డివాములపై పిడుగు పడటంతో అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే గడ్డివాములు మంటల్లో కాలిపోయాయి. ఈ ఘటనలో రైతుకు భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదని తెలిపారు. పిడుగుపాటుకు ఎలాంటి ప్రాణా నష్టం జరగలేదు. గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో రైతు అపార నష్టం జరిగిందని వాపోవడం జరిగింది. ప్రభుత్వ పరంగా రైతును ఆదుకోవాలని గ్రామ ప్రజలు అధికారులను కోరారు.



# నీలగిరి-సాహితీ సంగమం -6

## శీర్షిక:నిదుర

ఆ వె
నిదుర చిత్త వృత్తి నిత్య జీవనమున
దైవ వరము, జన్మ ధన్య తొందు
యావరించి నపుడు నాద మరపు నుండు
మెలకువ గొన మనసు మేలిమగును

ఆ వె
సంతసం బయినను సంకటం బయిననూ
నిదుర పట్ట బోదు నేత్రములకు
నిదుర పట్టు చుండు నిర్విచారము నుండ
నిదుర లేని బ్రతుకు నెగడ బోదు

ఆ వె
సెమము సేయ నిదుర చేరి యుండు కనుల
యలసి సొక్క జీవి యాద మరచు
చిత్తముంచ వలయు చింత లేకుండను
పట్టకున్న నిదుర ప్రాణ హాని

**సత్యనారాయణ బొలిశెట్టి**
**హైదరాబాదు**

## సరస్వతీ ప్రార్ధన

**సురభూజరాజము**
**నలువ పత్నికి వాణి కెప్పుడు నతులు చదువుల రాణికిన్**
**చెలువ మీరగ ప్రీతితో నిలిచి పదపటిమల నీయుమా**
**తలచుకొంచును శ్రద్ధతో నిరతము పదయుగళినిన్ మదిన్**
**కొలువుదీరుమ భారతీ నిను గొలిచెద మృదుల హాసినీ!**
**అంబురుహము**
**భారతి వాణివి పుస్తక ధారిణి పావనీ ప్రియకోమలీ**
**నీరజ లోచని బాసరవాసిని నీదు దీవెన కోరెదన్**
**సారము నేర్వగ బుద్ధిని పెంచుమ సన్నిధానము నీయుమా**
**గౌరిగ,శ్రీరమ శక్తుల రూపివి గావుమమ్మ సరస్వతీ!**

మాతా గంగాభవాని శాంకరీ దేవి

## శీర్షిక: - ప్లాస్టిక్
## ప్రక్రియ: -పద్యం(ఆటవెలది)

1
ప్లాస్టికన్నమాట ప్రకృతి వినాశకం
తెలుసుకోర జనుడ తెలివితోడ
జ్యూటు బ్యాగు వాడ చేటు కాదు మనకు
విజయపదము విన్న విలువ మీకు

2
ప్లాస్టికొకటి వచ్చి పలువిధముల మనకు
పనికివచ్చుతీరు పరిణమించె
వాటి వాడకమున మేటి ముప్పుననుచు
తెలుసుకొనుట మేలు తెలివితోడ

3
ప్లాస్టికనెడు పాము పాపిష్టి కోరల
చిక్కి జనులు నేడు చింత పడిరి
ఆధునికపు పేర యంతమై భువిపైన
చేతిపనులకెల్ల చేటువచ్చె

**విజయప్రసాద్ నలుమాసు**
**కరీంనగర్**

## భూమాతకు వందనం

మనిషి చేసేఅకృత్యాలని ఆటు పోట్లని తట్టుకుని
జనుల కడుపు నింపుతుంది పుడమి తల్లి
జీవరాసులకి ప్రాణాధారమైన జలానికి పుడమే ఆధారం.

రసాయనిక ఎరువులతో కలుషితం చేస్తూ
నదులని కాలుష్య కాసారాలుగా మార్చేస్తూ
అడవులను ధ్వంసం చేస్తూ
భూగర్భమును ఛిద్రం చేస్తూ
మనిషి అంతస్థులు నిర్మించు
కోవాలనుకుంటున్నాడు.
ఎన్ని అంతస్థులునిర్మించుకున్నా
పునాదులు బలంగాఉండాలని
మరిచిపోతున్నాడు.

ఆ భూమిని పవిత్రంగా చూసుకోవాలని
గ్రహించ లేకపోతున్నాడు
జీవుల మనుగడకు ఆధారామయిన
భూమాతకు మనసా శిరసా వందనం.

డా జి భవానీ కృష్ణమూర్తి
హైదరాబాద్

## కం!!

పర వనితల చెర బట్టుచు
పరమాత్ముని పూజ సేయ పాపములంటున్!!
తరతమ భేదము జూపక
పర వనితల గాచిన యెడ పరమాత్ముడగున్!!!

తెరవెనుక తప్పు జేయుచు
పరమాత్ముని పూజ సేయ పాపములంటున్!!
నిరుపేదల నాదుకొనిన
పరమాత్ముండె దిగివచ్చు వసుధకు కృష్ణా!!

చిరకాలపు రుజలు తరుగు
పరమాత్ముని పూజ సేయ; పాపములంటున్
పరమాత్ముని దూషించిన
చెరసాలను చేరుచుండు చివరకు కృష్ణా!!

**గడ్డం కృష్ణారెడ్డి.రేపాల సూర్యాపేట!**

## శ్రమ సౌందర్యము :-

పనిని చేయు చుండ పాటవమ్ముకలుగు
పనిని మానుకున్న ప్రతిభ తగ్గు
పనిని చేయకున్న ఫలితము శూన్యము
పని సులుపుచునుండ ప్రగతి పథము.

పనికి రానిదేది వస్తువనునది లేదు
యోచిచూడ ప్రజకు యుక్తి యుతము
పనికి రాని మనిషి పనికిరాడెపుడును
నాడుయైన మరియునేడుయైనఁ.

పల్లెటూళ్ళలోన,పట్టణములయందు
పనికి పోవుచునుంద్రు పరవశమున
బ్రతుకు బండినీడ్చ రయముగ పనికెళ్ళు
శ్రమసొగసు నీకు శమమునిచ్చు.

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి.**

## చార్ ధామ్

సీసము
ఉన్నతోన్నతమైన యుర్వీధరములందు
.కైలాసవాసుడే కానిపింప
హిమపాత వర్షాలు సుమహర్షమై దోప
పంచాక్షరిని బూని పరుగులిడగ
సెలయేళ్ళ నాదాలు శ్రీకరముగనొప్ప
ప్రకృతిశోభల మున్గిపరవశింప
కాశికా విశ్వేశు కమనీయ రూపము
నుత్తరకాశిలో చిత్తమలర

తే.గీ.
గాంచి ,భక్తితరంగిణీకలిత నైతి
సర్వసర్వజ్ఞు రూపమై పర్వమాయె
హైందవత్వపు పెన్నిధి యార్షనిధియు
చారుధామమ్ము మనపాలి సత్య పథము.

డా.గాయత్రీదేవి

## ఒంటరితనం

-ఎందరున్నా ఎవరూ లేనట్టు,
నిశ్శబ్దం నలువైపులా చుట్టుముట్టినట్టు...
మదిలోన ఏదో తెలియని భయం,
కనులముందు శూన్యమైపోతుంది ఈ ప్రపంచం!

-ఒంటరితనం ఒక కనిపించని వేదన,
గుండెల్లో దాగున్న బాధల గర్జన...
మనసంతా చీకటి ముసురుకున్నట్టు,
హృదయంలో చెలరేగెను ఎన్నో అలజడులు..

**కానీ....**
ఒంటరితనం ఒక స్వేచ్ఛామయ సమయం,
సాకారం చేసుకో నీ కలల సామ్రాజ్యం...
నిన్ను నీవు తెలుసుకునే అద్భుత ముహూర్తం,
ఆత్మపరిశీలనతో సాగించు కొత్త ప్రయాణం!

ఒంటరితనం ఎన్నటికీ ఒక శాపం కాదు,
నిన్ను నీకు పరిచయం చేసే కొత్త లోకం...
నీలోని శక్తిని, ప్రత్యేకతను మేల్కొల్పడానికి
నీ ఆత్మకు దొరికిన ఒక స్వేచ్ఛాసాగరం!

**గాధం అరుణ్ కుమార్,**
**శానబండ, జగిత్యాల జిల్లా.**

## ప్రత్యక్ష దైవము

**సీసము:-**
శ్రీ కరంబుగనెల్ల లోకాలనేలెడి
పరమాత్మ నిన్ను నే ప్రస్తుతింతు
అబ్జవల్లభ నీకు ననుదినమును మ్రొక్కి యంజలి
ఘటియింతునార్తిదీర
తమమును భేదించి ధరణికి వెల్గులన్
ప్రసరింపజేసిన భానుమూర్తి
భాస్కరా భగవంత భక్తకోటికి రోగ
బాధలు దొలగించు భవ్యతేజ
....
**తే.గీమాలిక.**
ఆదిమధ్యాంతరహిత హే యార్తరక్ష!
యచ్యుతా పుష్కరాక్ష శ్రీ యమరవినుత!
సూర్యనారాయణా నిత్యసుప్రసన్న!
దివ్యరథసప్తమీ పుణ్య తిథియె నీకు
జన్మదినమయ్యె జగపతి జయముగలుగ
ఆయురారోగ్యభాగ్యాల నందజేసి!
కరుణకురిపించి జనులను కావుమయ్య!!

**.....తిప్పారపు లక్ష్మీ నర్సయాచార్యులు**
**లక్ష్మీనర్సయాచార్యులు వెదిర**

## కాశీ నగరము

**తేటగీతి పద్యాలు**

డుండి గణపతి నెలకొన్న దండి స్థలము
అన్న పూర్ణమ్మ వెలసిన యవని నదియు
విశ్వనాథుడు కొలువైన విశ్వ మదియు
కాశి నగరము గాంచిన కలుగు శుభము

తల్లి పార్వతి కాపాడు ధరణి జనుల
గవ్వలమ్మయే రక్షించు కరుణ తోటి
వ్యాస భగవానుడుండిన వారణాసి
కాశి నగరము గాంచిన కలుగు శుభము

శైవ వైష్ణవ భేదాలు శైలపుత్రి
చూపదాయెను నచ్చట సుతల బ్రోవ
శివుని నామము పలికిన శివుడు పలుకు
కాశి నగరము గాంచిన కలుగు శుభము

**..జాధవ్ పుండలిక్ రావు పాటిల్**

## తెలుగు భాష

**తే.గీ.**

తెచ్చి యాంగ్లమును మనకు తెల్లదొరలు
తెలుగు మరపింప జేసిరి దేశ మందు
మోజు పడి పరభాషపై మోహపడక
మాతృ భాషామృతమెపుడు మరువరాదు..

తే.గీ.

అమృత మొలుకుచు పలుకుల నాలకింప
కలిగి యుండును తెలుగెంతొ కమ్మదనము
పికము పాటల వినిపించి వీనులకును
పనస తొనల మాధుర్యము పంచు నెపుడు!

**తే.గీ.**

తెలుగు గుర్తింపగ పడుచు తెగ యవస్థ
తెలుగు నేర్వగ తెలియక తీరు,తెన్ను
తెగులు పుట్టించె నెల్లరు తెలుగునకును
దేశ భాషల కనరాదు తెలుగు నేడు..

**మరింగంటి శ్రీనివాస్**
హైదరాబాద్

## అంశము: విత్తనము - ఫలము;

**శీర్షిక: సహనము**

సీసము:
బంధములను ద్రుంచి సంధి కోఁలగనేల
నోర్మి యున్న గృహము యుత్తమముర
ఒకటికొకటు తోడు యుండిన స్వర్గము!
కాలదన్ను కొనుట కలసి రాదు.
విస్తరముగ సృష్టి యస్తిత్వము నొసగె
కోల్పోవనేలనో యల్ప గుణము
పంతము బూనుట! స్వంతమె యందఱు
యన్న భావన గద యద్భుతమగు!
తేటగీతి:
ఇతర దేశము రాష్ట్రము లెన్నియున్న
యెందరు తెలుసు! వారితో పొందు కుదురు
నింటి వారితో పంతము హితమవదయ!
సహనశీలత మేలు మనకు జయమునదియె.

**ఇరువంటి నాగ దుర్గా**
**మాధురీ దేవి ఆనాగినిరి**
**హైదరాబాదు**

# ‘కరుప్పు’ బాక్సాఫీస్ దూకుడు..

## -తమిళనాడులో మరో రూ.100 కోట్ల మూవీ..




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం ‘కరుప్పు’ (తెలుగులో ‘వీరభద్రుడు’) బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే ‘కరుప్పు’ ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి.గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను ‘కరుప్పు’ సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.సినిమా వసూళ్ల విషయానికి వస్తే.. తొలి వారంలో దేశీయంగా నెట్ కలెక్షన్లు రూ.113 కోట్లకు పైగా నమోదైనట్లు సమాచారం. ఎనిమిది రోజులకు ఈ సంఖ్య మరింత పెరిగింది. విదేశీ మార్కెట్‌లో కూడా ఈ సినిమా మంచి వసూళ్లు సాధిస్తోంది. మొత్తం కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో ‘వీరభద్రుడు’ పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ఈ విజయంతో ‘కరుప్పు’ సూర్య కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అలాగే ఈ ఏడాదిలో అత్యంత విజయవంతమైన తమిళ చిత్రాల్లో కూడా స్థానం సంపాదించుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజీ తెరకెక్కించిన ఈ చిత్రానికి దైవిక నేపథ్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గ్రామ దేవత అయిన ‘వెట్టై కరుప్పు’ ఆధారంగా రూపొందించిన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఒక తండ్రి, కూతురికి న్యాయం చేయడానికి దేవుడు మానవ రూపంలో భూమిపైకి వచ్చే కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. సూర్య, త్రిషతో పాటు ఆర్జే బాలాజీ, ఇంద్రన్స్, అనఘా మాయా రవి, నట్టి సుబ్రమణ్యం, శ్వాసిక తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సంగీతం, భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు మరింత బలాన్ని చేకూర్చాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ‘కరుప్పు’ విజయంతో సూర్య అభిమానులు ఆనందంలో మునిగిపోతుండగా, ఈ సినిమా మరిన్ని రికార్డులను అందుకునే అవకాశాలపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

# నాగార్జునకు మే 23 స్పెషల్

## తొలి చిత్రం విక్రమ్ విడుదలై 23 ఏళ్లు




తన జీవితంలో ’మే 23’ ఎప్పటికీ ప్రత్యేకమేనని అగ్ర కథానాయకుడు నాగార్జున అన్నారు. అందులోనూ ఈ ఏడాది మరీ స్పెషల్ అని తెలిపారు. తన మొదటి చిత్రం ’విక్రమ్’ విడుదలై నేటికి 40 ఏళ్లు అయిన సందర్భంగా ఆయన పోస్ట్ పెట్టారు. తనను ఆదరిస్తున్న అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అందరికీ ధన్యవాదాలు. మే 23.. నేను ఎప్పటికీ మర్చిపోలేని రోజు.. మా నాన్న చివరి చిత్రం (మనం) 2014లో ఈరోజే విడుదలైంది. నాన్నతో పాటు నాగచైతన్య, అఖిల్‌లతో నటించే అవకాశం ఆ సినిమాతోనే దక్కింది. ఇక 40 ఏళ్ల క్రితం ఇదే రోజు నా మొదటి చిత్రం ’విక్రమ్’ విడుదలైంది. మిమ్మల్ని అలరించడం కోసం, మీ ప్రేమాభిమానాలు పొందడం కోసం నేను ఇండస్ట్రీకి వచ్చాను. ’విక్రమ్’ నాకు ఎంతోమంది అభిమానులను దగ్గర చేసింది. ఇన్నేళ్లుగా నాకు అండగా నిలిచిన అభిమానులందరికీ నా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని మే 23లను ఇలానే సెలబ్రేట్ చేసుకోవాలని కోరుకుంటున్నా‘ అని నాగార్జున తన పోస్ట్‌లో పేర్కొన్నారు. నాగార్జున హీరోగా మధుసూధనరావు తెరకెక్కించిన చిత్రం ’విక్రమ్’ 1986 మే 23న విడుదలై విజయాన్ని అందుకుంది. 1983లో బాలీవుడ్‌లో విడుదలైన ’హీరో’ సినిమాకు రీమేక్‌గా రూపొందింది. ప్రస్తుతం కింగ్ తన 100వ సినిమాతో బిజీగా ఉన్నారు. తమిళ దర్శకుడు రా.కార్తీక్ తెరకెక్కిస్తున్నారు. ’కింగ్ 100’అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉంది. నాగార్జున ఇందులో పలు రకాల గెటప్పుల్లో కనిపిస్తారని, ఆయన పేరు చెప్పగానే శివ, రక్షకుడుతోపాటు, ’కూలీ’లో పోషించిన సైమన్ లాంటి స్టైలిష్ పాత్రలు గుర్తొస్తాయని, వాటన్నిటినీ గుర్తుచేసేలా ’కింగ్ 100’ ఉంటుందని దర్శకుడు ఇటీవల తెలిపారు.

# ఆదర్శకుటుంబంలో అతిథిగా?



వ్యక్తిగత జీవితంలోని ఒడిదుడుకుల కారణంగా దాదాపు మూడేళ్లుగా సినిమాలకు దూరమైంది తమిళ సొగసరి నివేదా పేతురాజ్. దుబాయ్‌కి చెందిన ఓ వ్యాపారవేత్తతో విఫల ప్రేమాయణం ఈ భామను మానసికంగా కుంగదీసిందని చెబుతారు. అందం, అభినయం కలబోసిన పాత్రల్లో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన ఈ భామ టాలీవుడ్‌లో పునరాగమనానికి సిద్ధమవుతున్నది. తాజా సమాచారం ప్రకారం వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న ‘ఆదర్శకుటుంబం’ చిత్రంలో నివేదా పేతురాజ్ అతిథి పాత్రలో నటించనున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో కథానాయికగా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా..కీలకమైన అతిథి పాత్రలో నివేదా పేతురాజ్ కనిపించనుందని సమాచారం. త్వరలో ‘ఆదర్శకుటుంబం’ సెట్స్‌లోకి ఈ తమిళందం అడుగుపెట్టబోతున్నదట. అయితే ఈ వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ఫ్యామిలీ ఎమోషన్స్‌కు థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను జోడించి తనదైన కామెడీ హంగులతో దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.






# అవన్నీ ఫేక్..

## బికినీ ఫొటోలపై స్పందించిన నటి రుక్మిణి వసంత్



‘సప్త సాగరాలు దాటి’ సినిమాతో తెలుగు ప్రేక్షకులలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన కొన్ని బికినీ ఫోటోషూట్ క్లిప్స్ సోషల్ మీడియాలో విపరీతంగా హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే. గ్రీన్ కలర్ బికినీ ధరించి ఆమె స్విమ్మింగ్ పూల్‌లోకి దిగుతున్నట్లు ఉన్న ఈ విజువల్స్ నెటిజన్లను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురిచేశాయి. చుట్టూ కెమెరాలు, టెక్నీషియన్లు ఉండటంతో ఇది ఏదైనా అధికారిక షూట్ అయ్యి ఉంటుందని కొందరు భావించగా, మరికొందరు మాత్రం ఇది ఏఐ డీప్‌ఫేక్ అయ్యి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే ఈ వివాదంపై తాజాగా నటి రుక్మిణి వసంత్ అధికారికంగా స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్నెట్‌లో తన పేరిట సర్క్యులేట్ అవుతున్న బికినీ చిత్రాలన్నీ పూర్తిగా AI ద్వారా సృష్టించిన నకిలీ ఫోటోలని ఆమె స్పష్టం చేశారు. ఆ చిత్రాలు పూర్తిగా తప్పుడు సమాచారంతో, కల్పితంగా సృష్టించబడినవని ఆమె పేర్కొన్నారు. బాధ్యతారాహిత్యంగా ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తూ ఇటువంటి మార్ఫింగ్ కంటెంట్‌ను తయారు చేయడం మరియు వాటిని వైరల్ చేయడం తీవ్రమైన నేరమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని తన టీమ్ చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, ఈ ఫోటోలను సృష్టించిన వారిపై, అలాగే వీటిని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ప్రచారం కల్పిస్తున్న వారిపై సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నట్లు రుక్మిణి వెల్లడించారు. నెటిజన్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ కంటెంట్‌ను ఇతరులకు షేర్ చేయవద్దని, వాటిని ప్రోత్సహించవద్దని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.